సాక్షి విశాఖపట్నం

గురువారం । 16 । జనవరి । 2025

ఎగిరే గాలిపటమా..!









ప్రమాదం జరగకుండా దారాన్ని చుడుతున్న పోలీస్

సంక్రాంతి సంబరాల్లో భాగంగా సాగరతీరంలో గాలిపటాలు పైపైకి ఎగిరి ఆనందాన్ని పంచాయి. పండగ వేళ ఇతర ప్రాంతాల వారు స్వస్థలాలకు తరలి పోగా.. నగరవాసులు మాత్రం బీచ్‌రోడ్డులో గాలిపటాలను పోటాపోటీగా ఎగురవేశారు. వైఎంసీఏ నుంచి కోస్టల్ బ్యాటరీ వరకు పెద్ద సంఖ్యలో పతంగులు పైకి ఎగరడంతో నింగి రంగులమయమైంది. పిల్లలు గాలిపటాలను ఎగురవేస్తూ ఆనందంగా గడిపారు. ఈ దృశ్యం చూసిన పెద్దలు కూడా తమ బాల్య జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. కాగా.. మాంజా దారం వల్ల ఎటువంటి ప్రమాదాలు జరగకుండా పోలీసులు అప్రమత్తంగా వ్యవహరించారు. అనుకోకుండా ఓ గాలిపటం తెగిపడి, దాని దారం బీచ్‌రోడ్డులో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఓ కుటుంబానికి చుట్టుకుంది. అయితే అదృష్టవశాత్తు ఎటువంటి ప్రమాదం జరగలేదు.

ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

\- దాబాగార్డెన్స్

వేదికపై నుంచి కోళ్ల పందాలను తిలకిస్తున్న ఎంపీ సీఎం రమేష్, ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి



కూటమి నేతలకే

అసలైన సంక్రాంతి!

- ఇష్టారాజ్యంగా కోడి పందాల నిర్వహణ
- లాటరీ బళ్లు, బెల్టు షాపులకు వేలం పాట
- మామూళ్లు తీసుకుని కేసులు పెట్టకుండా జాగ్రత్తపడ్డ పోలీసులు
- బెల్టు షాపులకు అక్రమ వసూళ్లతో అధికార ముద్ర వేసిన ఎక్సైజ్ సిబ్బంది
- ఏకంగా పోలీసు బందోబస్తుతో పాఠశాలలో కోడి పందాల నిర్వహణ
- ముఖ్య అతిథులుగా హాజరైన ఎంపీ సీఎం రమేష్, ఎమ్మెల్యే బండారు
- హోం మంత్రి ఇలాకాలో కోడి పందాల జోరు



వేంపాడులో బరిలో కోడిపుంజుతో ఎంపీ రమేష్

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం:

ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలోని పేదల ఇళ్లల్లో నగదు కొరత కారణంగా ఈ సంక్రాంతి నిరాడంబరంగా జరగ్గా.. కోడి పందాల నిర్వహణతో కొందరు కూటమి నేతలు భారీగా ఆదాయం సమకూర్చుకున్నారు. ప్రధానంగా రాష్ట్ర హోంశాఖ మంత్రి నియోజకవర్గమైన పాయకరావుపేటతోపాటు యలమంచిలి, మాడుగుల నియోజకవర్గాల్లో కోడి పందాలు భారీ స్థాయిలో జరిగాయి. పాయకరావుపేట నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో కోడి పందాలు జరగగా.. యలమంచిలిలోనూ భారీ ఎత్తున నిర్వహించారు. అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్, మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి సమక్షంలోనే పాఠశాలలో పోలీసుల బందోబస్తు మధ్య పందాలు నిర్వహించడం గమనార్హం. ఈ మూడు నియోజకవర్గాల్లో భారీ ఎత్తున టెంట్లు వేసి ఈ కార్యకలాపాలు నిర్వహించగా, మిగిలిన నియోజకవర్గాల్లో కూడా గట్టిగానే జరిగాయి. పోలీసులు మాత్రం చిన్న చిన్న కేసులు నమోదు చేసి తమ బాధ్యతను నిర్వర్తించినట్లు ప్రకటించినప్పటికీ, అసలైన నిర్వాహకుల జోలికి పోకుండా జాగ్రత్త పడ్డారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇక బెల్టు షాపుల నిర్వహణకు అనుమతులిచ్చి అనకాపల్లి జిల్లా ఎక్సైజ్ అధికారులు భారీగానే సంక్రాంతి మామూళ్లు వసూలు చేసుకున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇలా అటు కూటమి నేతలు... ఇటు వివిధ శాఖల అధికారులు సంక్రాంతి పండగను బాగానే చేసుకున్నారు. ఈ కార్యకలాపాల వల్ల మొత్తంగా రూ.10 కోట్ల మేర లావాదేవీలు జరిగినట్టు తెలుస్తోంది.

అనకాపల్లి మండలం సీతానగరం గ్రామంలో కోడి పందాలతోపాటు పేకాట నిర్వహణ బహిరంగంగానే జరిగింది. శీరంశెట్టివానిపాలెం, పాపయ్యపాలెం గ్రామాల్లోని తోటల్లో విచ్చలవిడిగా కోడి పందేలు, పేకాట శిబిరాలు ఏర్పాటు చేశారు.

పాఠశాలలో.. పోలీసు బందోబస్తుతో..



మాడుగుల నియోజకవర్గంలో కూటమి నేతలు మరో అడుగు ముందుకు వేశారు. దేవరాపల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో పోలీసు బందోబస్తు నడుమ కోడి పందాలు నిర్వహించడం వివాదాస్పదంగా మారింది. అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్, ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి హాజరైన సంక్రాంతి వేడుకల్లో ఇలా జరగడం గమనార్హం. ప్రభుత్వ పాఠశాలను కోడిపందాలకు వేదికగా మార్చడం, పైగా పోలీస్ బందోబస్తు కల్పించంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఒక వైపు ప్రభుత్వ విద్యను కూటమి ప్రభుత్వం గాలికొదిలేసింది. ఇప్పుడు ఏకంగా కోడి పందాలకు ప్రభుత్వ పాఠశాలను కేంద్రంగా మార్చిన కూటమి నేతల తీరుపై ఆగ్రహం వ్యక్తమవుతోంది. అలాగే భీమిలి, పెందుర్తి, గాజువాక, అనకాపల్లి, చోడవరం, నర్సీపట్నం నియోజకవర్గాల్లో కూడా భారీ స్థాయిలో కాకపోయినా.. జోరుగా కోడిపందాలు సాగాయి.

హోం మంత్రి ఇలాకాలో..

రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత ప్రాతినిధ్యం వహిస్తున్న పాయకరావుపేట నియోజకవర్గంలో భారీ స్థాయిలో కోడి పందాలు జరిగాయి. అడ్డురోడ్డుతో పాటు వేంపాడు టోల్‌ప్లాజా వద్ద పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేసి మరీ కోడి పందాలు నిర్వహించడం గమనార్హం. ఈ వ్యవహారమంతా తెలిసినా అటువైపుగా పోలీసులు కనీసం కన్నెత్తి కూడా చూడలేదు. వందల మంది ప్రజలు గుమిగూడి భారీగా కోడి పందాలు నిర్వహిస్తున్నా.. ఏదైనా సంఘటన జరిగితే స్పందించే దిక్కులేకుండా పోయిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. చట్టాన్ని రక్షించాల్సిన హోంమంత్రి నియోజకవర్గంలోనే సుప్రీంకోర్టు ఆదేశాలకు భిన్నంగా కోడి పందాలతోపాటు లాటరీ బళ్లు, బెల్టు షాపులను నిర్వహించడం, అటు పోలీసులు కానీ ఇటు ఎక్సైజ్ సిబ్బంది గానీ పట్టించుకోకపోవడంపై ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. లాటరీ బళ్లు, బెల్టు షాపు నిర్వహణను హోం మంత్రి అనుచరులు దక్కించుకుని... ఇష్టారీతిలో జూదాన్ని ప్రోత్సహించారు. మద్యాన్ని అధిక ధరలకు విక్రయించారు. మామూళ్లు అందడంతోపాటు ఇటువైపు చూడొదన్న ఆదేశాలతోనే పోలీసులు, ఎక్సైజ్ సిబ్బంది కిమ్మనకుండా ఉండిపోయారని తెలిసింది.

యలమంచిలిలోనూ అదే జోరు...!

పాయకరావుపేట నియోజకవర్గం తర్వాత భారీగా కోడి పందాలు నిర్వహించిన నియోజకవర్గంగా జనసేన ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ ప్రాతినిధ్యం వహిస్తున్న యలమంచిలి నిలిచింది. నియోజకవర్గంలోని అచ్యుతాపురం మండలం రామన్నపాలెం వద్ద కోడి పందాల బరులను ఏర్పాటు చేసి.. లాటరీ బళ్లతో పాటు బెల్టు షాపులకు వేలం నిర్వహించారు. ఈ వేలంలో మునగపాకకు చెందిన వ్యక్తి బెల్టు షాపును, యలమంచిలికి చెందిన జనసేన కార్యకర్త లాటరీ బళ్ల నిర్వహణ హక్కును దక్కించుకున్నట్లు సమాచారం. ఇక్కడ కూడా జూదం, అధిక ధరలకు మద్యం అమ్మకాలు బహిరంగంగా జరిగిన ప్పటికీ పోలీసులు పట్టించుకోలేదు. మరోవైపు కోడి పందాలు, మద్యం విక్రేతల నుంచి రూ.720, రూ.2,100 పట్టుకున్నట్లు పోలీసులు విడుదల చేసిన పత్రికా ప్రకటన చూసి ప్రజలతో పాటు నిర్వాహకులు నవ్వుకున్నారు. కోట్ల రూపాయలతో జరిగే పందాలను పట్టించుకోకుండా.. గల్లీల్లో సరదాకు ఆడుకునే వారిని పట్టుకుని కేసులు నమోదు చేయడంపై విమర్శలు వస్తున్నాయి.

కొత్త అల్లుడికి పసందైన విందు



'అహ్హాహ్హా... భోజనంబు... వింతైన వంటకంబు..'మాయాబజార్ సినిమాలో ఎస్వీ రంగారావు వంటకాలను భుజిస్తున్న సన్నివేశం గుర్తుందా? అలాంటి సన్నివేశం నిజ జీవితంలోనూ ఎదురైతే.? జీవీఎంసీ 87వ వార్డు, వడ్లపూడి నిర్వాసిత కాలనీ, గవర వీధికి చెందిన స్టీల్ ప్లాంట్ ఉద్యోగి కాండ్రేగుల శివకుమార్, తన కుమార్తె ధిల్లేశ్వరిని వెంకుపాలేనికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఆదారి వెంకట అజయ్‌కు ఇచ్చి ఇటీవల వివాహం జరిపించారు. మొదటి సంక్రాంతి సందర్భంగా కొత్త అల్లుడిని ఆహ్వానించి ప్రత్యేక విందు ఏర్పాటు చేసి ఆశ్చర్యపరిచారు. శాకాహార వంటలు, పిండివంటలు, డ్రైఫ్రూట్స్, స్వీట్లు ఇలా మొత్తం 153 రకాల పసందైన వంటకాలతో విందు ఏర్పాటు చేసి కొత్త అల్లుడు, కుమార్తెకు ఘన స్వాగతం పలికారు. ఇన్ని రకాల వంటకాలు చూసి 'కాండ్రేగుల'మర్యాదలకు అల్లుడు ముగ్ధులయ్యారు.

\- అగనంపూడి

ఎస్బీ హెడ్ కానిస్టేబుల్ సస్పెన్షన్

'క్రికెట్ బుకీలకు కూటమి అండ' కథనానికి స్పందించిన సీపీ

సాక్షి ఎఫెక్ట్..

అల్లిపురం: విధుల్లో అవినీతికి పాల్పడిన స్పెషల్ బ్రాంచ్ హెడ్ కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేస్తూ నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. 'సాక్షి'దినపత్రికలో ఈ నెల 11న 'క్రికెట్ బుకీలకు కూటమి అండ'పేరుతో స్పెషల్ బ్రాంచ్ కానిస్టేబుల్ వ్యవహారంపై కథనం ప్రచురితమైంది. ఈ కథనంపై స్పందించిన సీపీ, కానిస్టేబుల్ వ్యవహారాన్ని సీరియస్‌గా తీసుకున్నారు. దీనిపై వెంటనే దర్యాప్తుకు ఆదేశించారు. హెడ్ కానిస్టేబుల్ పి.గంగరాజుకు క్రికెట్ బుకీలతో సంబంధాలు ఉన్నట్లు కమిషనర్ గుర్తించారు. అతని ఫోన్ కాల్ డేటాలోని నంబర్ల ద్వారా గత రెండేళ్లుగా ఒక కేసులో నిందితులుగా ఉన్న క్రికెట్ బుకీలతో సంబంధాలు ఉన్నట్లు దర్యాప్తులో తేలింది. దీంతో అతన్ని సస్పెండ్ చేస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ వ్యవహారంలో కొందరు కూటమి ఎమ్మెల్యేల అండ కూడా ఉన్నట్లు వచ్చిన ఆరోపణలపై ఆయన స్పందించారు.

ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ నగర పోలీస్ శాఖలో పని చేస్తున్న అధికారులు, సిబ్బంది పూర్తి పారదర్శకంగా విధులు నిర్వర్తించాలని, ఎటువంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినా, అధికార దుర్వినియోగానికి పాల్పడినా చర్యలు తప్పవని స్పష్టం చేశారు. నగర పోలీస్ శాఖలో ఎవరైనా లంచం అడిగినా, తీసుకున్నా వెంటనే తన ఫోన్ నంబర్ 79950 95799కు తెలియజేయాలని సూచించారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని ఆయన తెలిపారు.

కనులపండువగా గజేంద్రమోక్ష ఉత్సవం



శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి మకరవేట (గజేంద్ర మోక్షం) ఉత్సవం బుధవారం రాత్రి కనుల పండువగా జరిగింది.

8లో

నగరం వెలవెల.. తీరం కిటకిట






నిత్యం రద్దీగా ఉండే విశాఖ మహానగరం రహదారులు నిర్మానుష్యంగా మారగా.. మరో వైపు సాగర తీరం సందర్శకులతో ఎప్పటిలాగే కిటకిటలాడింది. నగరంలో ఉపాధి పొందుతున్న పలు జిల్లాల ప్రజలు సంక్రాంతి పండగకు సొంతూళ్లు వెళ్లిపోయారు. మరోవైపు ఆర్.కె.బీచ్‌కు స్థానికులు కుటుంబ సభ్యులతో తరలివచ్చారు.

ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

అయ్యన్న ముంగిట్లో సీఎం రమేష్ హడావుడి

రగులుతున్న కుంపటి

- మూడు రోజులుగా నర్సీపట్నంలో తిష్ట వేసిన సీఎం రమేష్
- బీజేపీ, జనసేన నేతలతో కలిసి సంక్రాంతి సందడి
- కన్నెత్తి చూడని అయ్యన్న, టీడీపీ నేతలు
- స్పీకర్ ఆధ్వర్యంలో జరిగే మకరజ్యోతి మహోత్సవానికి రమేష్‌కు అందని ఆహ్వానం
- బీజేపీలో చేరికలపై అయ్యన్న ఆగ్రహం
- తనకు సమాచారం లేకుండా చేర్చుకున్నారని మండిపాటు
- ప్రధాని పర్యటనలో తనకు కనీస గౌరవం ఇవ్వకపోవడంపై కినుక?



సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం: అయ్యన్న ముంగిట్లో అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ సంక్రాంతి సందడి చేశారు. నర్సీపట్నంలోని ప్రైవేటు రిసార్టులో గత మూడు రోజులుగా మకాం వేసిన రమేష్... సంక్రాంతి వేడుకలను బీజేపీ, జనసేన నేతలతో కలిసి నిర్వహించుకున్నారు. ఇటువైపు కనీసం టీడీపీ నేతలు కన్నెత్తి చూడలేదు. మరోవైపు స్పీకర్ ఆధ్వర్యంలో నర్సీపట్నంలో జరుగుతున్న మకర జ్యోతి మహోత్సవాలకు సీఎం రమేష్‌ను ఆహ్వానించలేదు. ఒకవైపు నర్సీపట్నం కేంద్రంగా పలువురు నేతలను తనకు తెలియకుండా బీజేపీలో చేర్చుకోవడంతోపాటు పోటీగా రాజకీయాలు చేస్తున్నారని అయ్యన్న భావిస్తున్నట్టు తెలుస్తోంది. తనకు కనీస సమాచారం లేకుండా జరుగుతున్న చేరికలపై ఆయన ఆగ్రహంగా ఉన్నట్టు సమాచారం. మరోవైపు కొద్దిరోజుల క్రితం విశాఖపట్నంలో జరిగిన ప్రధాని సభ సందర్భంగా కూడా స్పీకర్ హోదాలో తనకు కనీస గుర్తింపు దక్కలేదని ఆయన కినుక వహించినట్టు తెలుస్తోంది. ప్రధాని సభకు జన సమీకరణ సందర్భంగా... నర్సీపట్నంలో మీరు చేర్చుకున్న నేతల ద్వారా జనాలను తరలించుకోండంటూ సీఎం రమేష్‌కు అయ్యన్న గట్టిగా బదులిచ్చినట్టు సమాచారం. మొత్తంగా నర్సీపట్నంలోని ఓ ప్రైవేటు రిసార్టు కేంద్రంగా జరిగిన సంక్రాంతి వేడుకలు కాస్తా కూటమిలో భోగి మంటలను మించి వేడిని రాజేశాయని అర్థమవుతోంది.

కొరివితో తలగోక్కున్నట్టు...!

వాస్తవానికి అనకాపల్లి ఎంపీ పోటీలో స్థానికేతరుడైన దిలీప్‌కుమార్‌కు సీటు ఇవ్వాలని టీడీపీ భావించింది. ఈ సీటును తన కుమారుడి కోసం ఆశించిన అయ్యన్నపాత్రుడు... స్థానికేతరులకు టికెట్ ఇస్తే సహకరించేది లేదంటూ ఎన్నికల ముందు జరిగిన పార్టీ సమావేశాల్లో బహిరంగంగానే మాట్లాడారు. అయితే, పొత్తులో భాగంగా ఈ సీటును బీజేపీకి వదులుకోవాల్సి వచ్చింది. ఆ తర్వాత ఈ స్థానంలో ఎంపీ అభ్యర్థిగా సీఎం రమేష్‌ను బీజేపీ ప్రకటించింది. అనూహ్యంగా అయ్యన్నపాత్రుడు రమేష్‌ను వెంటబెట్టుకుని మరీ ఎన్నికల్లో కలియతిరిగారు. మిగిలిన నేతల కంటే ఎక్కువగా సీఎం రమేష్‌తో సఖ్యతగా మెలిగారు. తీరా ఎన్నికల తర్వాత నర్సీపట్నంలోనే సీఎం రమేష్ రాజకీయం మొదలుపెట్టారు. దీంతో కొరివితో తలగొక్కున్నట్టుగా పరిస్థితి తయారయ్యిందని అయ్యన్న వాపోతున్నట్టు తెలుస్తోంది. మరోవైపు విశాఖలో ప్రధాని పర్యటన సందర్భంగా నర్సీపట్నం నుంచి జనసమీకరణపై సీఎం రమేష్ అయ్యన్నను కదిపే ప్రయత్నం చేశారు. మీరు చేర్చుకున్న నాయకులతో జనాలను తరలించుకు వెళ్లండంటూ అయ్యన్న గట్టిగానే బదులిచ్చినట్టు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే తాజాగా సంక్రాంతి సందర్భంగా సీఎం రమేష్ నర్సీపట్నంలో మకాం వేయడం చర్చనీయాంశమవుతోంది. సీఎం రమేష్ సమక్షంలో బీజేపీలో చేరిన ఇద్దరు విశాఖ డెయిరీ డైరెక్టర్లతో పాటు ఓ డాక్టర్, జనసేన నేతలు సదరు ప్రైవేటు రిసార్టు వద్ద హడావుడి చేస్తున్నారు. అయితే, అటువైపు ఏ ఒక్క టీడీపీ నేత కానీ కార్యకర్త కానీ వెళ్లకపోవడం గమనార్హం.

విశాఖ డెయిరీ డైరెక్టర్ల చేరికపై...!

విశాఖ డెయిరీలో అక్రమాలు జరుగుతున్నాయంటూ హడావుడిగా అసెంబ్లీలో సభా సంఘాన్ని స్పీకర్ అయ్యన్న ఏర్పాటు చేశారు. దీనిపై పార్టీలోని నేతల మధ్య భిన్నాభిప్రాయాలున్నాయనే ప్రచారం ఉంది. మరోవైపు తమ పార్టీలో విశాఖ డెయిరీ నేతలను చేర్చుకుంటున్నట్టు సీఎం రమేష్.... అయ్యన్నకు సమాచారమిచ్చినప్పటికీ ఆ విషయంలో ముందుకు వెళ్లడంపై కూడా సీఎం రమేష్ అసహనాన్ని వ్యక్తం చేసినట్టు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే నర్సీపట్నం నియోజకవర్గంలోని ఇద్దరు విశాఖ డెయిరీ డైరెక్టర్లు సూర్యానారాయణ, రాజకుమారిలను బీజేపీలో చేర్చుకున్నారు. అంతేకాకుండా నర్సీపట్నంలోని డాక్టర్ కిలాడి సత్యనారాయణను కూడా తాజాగా ప్రధాని పర్యటన సందర్భంగా బీజేపీలో చేర్చుకున్నారు. ఈ చేరిక వెనుక కూడా సీఎం రమేష్ ఉన్నట్టు అయ్యన్న మండిపడుతున్నారు. అనకాపల్లి జిల్లాలో సీఎం రమేష్ అంటే ఎవరో తెలియని సందర్భంలో ప్రతీ చోట పరిచయం చేసిన తననే లెక్కచేయకపోవడంపై అయ్యన్న ఆగ్రహంతో ఊగిపోతున్నారు. మొత్తంగా సంక్రాంతి పండుగ కాస్తా కూటమి నేతల మధ్య కుంపటి రాజేసిందని చెప్పవచ్చు.

క్లుప్తంగా

రచయిత ఎంవీవీ ఇక లేరు



సీతంపేట: ప్రముఖ రచయిత ఎం.వి.వి.సత్యనారాయణ బుధవారం మధ్యాహ్నం మద్రిపాలెంలోని తన నివాసంలో కన్నుమూశారు. ఆయన వయసు 76 సంవత్సరాలు. ఆయనకు భార్య సత్యవతి, కుమార్తెలు శిరీష, సౌజన్య ఉన్నారు. చందమామ పత్రికలో కథలు, నవలలు రాసి గొప్ప రచయితగా పేరు పొందారు. బాల సాహిత్యం, ప్రౌఢ సాహిత్యం, అపరాధ పరిశోధక సాహిత్యం, అనువాద సాహిత్యంపై ఆయన విశేష కృషి చేశారు. ఆయన పెద్దాపురంలో జన్మించినప్పటికీ, ఉద్యోగ రీత్యా(ఏయూ) విశాఖపట్నంలో స్థిరపడ్డారు. ఆయన పార్థివ దేహాన్ని కేజీహెచ్‌కు కుటుంబ సభ్యులు దానం చేశారు. సత్యనారాయణ మృతి పట్ల పలువురు సాహితీవేత్తలు సంతాపం వ్యక్తం చేశారు.

మహిళా కానిస్టేబుల్ సెల్‌ఫోన్ చోరీ

అగనంపూడి: సంక్రాంతి పండగ సందర్భంగా దువ్వాడ పోలీస్‌స్టేషన్ ఆవరణలో ముగ్గులు పెడుతున్న మహిళా కానిస్టేబుల్ మొబైల్ ఫోన్‌ను ఒక వ్యక్తి చోరీ చేసి, సీసీ ఫుటేజ్ ద్వారా దొరికిపోయాడు. పోలీసులు తెలిపిన వివరాలు. మంగళవారం సంక్రాంతిని పురస్కరించుకు ఓ మహిళా కానిస్టేబుల్ స్టేషన్ ఆవరణలో ముగ్గులు పెడుతూ సెల్‌ఫోన్‌ను టేబుల్‌పై పెట్టారు. ఈలోగా అక్కడికి పూటుగా మద్యం సేవించి వచ్చిన వడ్లపూడి రజకవీధికి చెందిన వ్యక్తి ముగ్గుపై ఉమ్మివేశాడు. కానిస్టేబుల్ వారించినా పట్టించుకోలేదు. ఈలోపే టేబుల్ పైనున్న ఫోన్‌ను దొంగిలించాడు. సీసీ ఫుటేజ్‌ను పరిశీలించి, సదరు వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకుని, ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. అయితే అప్పటికీ అతను సెల్‌లోని సిమ్‌కార్డును బయటపడేశాడు. మహిళా కానిస్టేబుల్ ఫిర్యాదు ఇవ్వకపోవడంతో కేసు నమోదు చేయలేదని సీఐ మల్లేశ్వరరావు తెలిపారు.

సెల్లార్లో ఆడుకుంటుండగా.. కారు ఢీకొని చిన్నారి మృతి

అక్కిరెడ్డిపాలెం: సంక్రాంతి పండగను ఎంతో ఆనందంగా చేసుకుందామని అమ్మమ్మ, తాతయ్య ఇంటికి వచ్చిన చిన్నారి ఆడుకుంటుండగా కారు ఢీకొంది. దీంతో తీవ్రగాయాలైన చిన్నారి, చికిత్స పొందుతూ మృతి చెందింది. గాజువాక ట్రాఫిక్ సీఐ కోటేశ్వరరావు తెలిపిన వివరాలు. పెందుర్తి సుజాతానగర్‌కు చెందిన బోగిర్ల నవీన్‌కుమార్ కూతురు బోగిర్ల లార్ని(5). భార్య, పాపతో కలిసి మంగళవారం సాయంత్రం గాజువాకలోని లంకా మైదానం పక్కనున్న సెలెస్ట్ అపార్ట్‌మెంట్‌లో ఉంటున్న అత్తగారింటికి సంక్రాంతి పండగకు వచ్చారు. బుధవారం ఉదయం సెల్లార్‌లో లార్ని ఆడుకుంటోంది. అపార్ట్‌మెంట్ నివాసి, పరవాడ బయోకాన్ ఫార్మాసిటీ క్లస్టర్ హెడ్ రాజేష్ ధీటి తన కారును పార్కింగ్ చేసేందుకు వేగంగా సెల్లార్లోకి వస్తూ ఆడుకుంటున్న చిన్నారిని ఢీకొట్టాడు. ప్రమాదంలో లార్నికి తీవ్ర గాయాలవడంతో షీలానగర్‌లోని కిమ్స్ ఐకాన్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మరణించింది. సమాచారం అందుకున్న గాజువాక ట్రాఫిక్ సీఐ కోటేశ్వరరావు కేసు నమోదు చేసి, ప్రమాదానికి కారణమైన రాజేష్‌ను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. చిన్నారి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

స్టాఫ్ నర్సు పోస్టుల దరఖాస్తు గడువు పొడిగింపు

మహారాణిపేట: ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఖాళీగా ఉన్న 106 స్టాఫ్ నర్సు పోస్టుల భర్తీకి నిరుద్యోగుల నుంచి అధిక సంఖ్యలో దరఖాస్తులు వస్తున్నాయి. ఇప్పటివరకు ఆఫ్‌లైన్‌లో 7,400 దరఖాస్తులు అందినట్లు వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ సంచాలకురాలు డాక్టర్ పి.రాధారాణి తెలిపారు. ముందుగా ఈ నెల 15వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించాలని ప్రకటించినప్పటికీ.. సంక్రాంతి కారణంగా ఈ గడువును ఈ నెల 17 వరకు పొడిగించారు. అభ్యర్థులు పూర్తి చేసిన దరఖాస్తులను రేసవానిపాలెం, డీఎంహెచ్‌వో కార్యాలయ ఆవరణలోని తమ కార్యాలయంలో సమర్పించాలని కోరారు. వివరాలకు https://nagendrasvst.wordpress.com/ లేదా https:// cfw. ap. nic. in సంప్రదించవచ్చు.

- వరదరాజస్వామి అలంకరణలో దర్శనమిచ్చిన సింహాద్రి అప్పన్న
- గజవాహనంపై విశేషంగా గ్రామ తిరువీధి
- పరవశించిన భక్తజనం

కనుల పండువగా గజేంద్రమోక్ష ఉత్సవం



పూలతోటలో గజేంద్రమోక్షం ఉత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి మకరవేట (గజేంద్ర మోక్షం) ఉత్సవం బుధవారం రాత్రి కనుల పండువగా జరిగింది. సింహాచలం దేవస్థానం వైదికులు కొండదిగువ పూలతోటలో ఈ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉత్సవంలో భాగంగా వరాహ లక్ష్మీనృసింహస్వామి వరదరాజస్వామి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. స్వామిని కనులారా తిలకించిన భక్తులు పరవశించారు. ముందుగా స్వామి ఉత్సవమూర్తి గోవిందరాజ స్వామికి వరదరాజస్వామిగా అలంకరించి.. సాయంత్రం సింహగిరి నుంచి మెట్లమార్గం ద్వారా కొండదిగువకు తీసుకొచ్చారు. తొలిపావంచా వద్దకు చేరుకున్న స్వామికి అడవివరం గ్రామస్తులు, దేవస్థానం అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. అక్కడి నుంచి స్వామిని ఆయన సోదరి, అడవివరం గ్రామదేవత పైడితల్లి అమ్మవారి ఆలయం వద్దకు ఊరేగింపుగా తీసుకెళ్లారు. అమ్మవారి ఆలయం వద్ద స్వామికి మహిళలు మంగళహారతులిచ్చారు. అక్కడి నుంచి స్వామిని పూలతోటకి తీసుకెళ్లి ప్రధాన మండపంలో అధిష్టింపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, షోడషోపచార పూజలు నిర్వహించారు. అనంతరం భాగవత పురాణ విన్నపం, గజేంద్ర మోక్షం ఘట్ట విన్నపం చేశారు. తదుపరి స్వామిని అక్కడి నుంచి పుష్కరిణి సత్రం వద్దకు తీసుకొచ్చి గజవాహనంపై అధిష్టించి..విశేషంగా తీరువీధి నిర్వహించారు. తమ ఇళ్ల ముందుకి వచ్చిన స్వామికి గ్రామస్తులు విశేషంగా హారతులిచ్చారు. దేవస్థానం స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకుడు ఇరగవరపు రమణాచార్యులు, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, అర్చకులు రాజీవాచార్యులు తదితరులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. దేవస్థానం ఈఈ త్రినాధరావు ఆధ్వర్యంలో ఇంజినీరింగ్ అధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు. పూలతోటను పెద్ద ఎత్తున విద్యుద్దీపకాంతులతో అలంకరించారు. గోపాలపట్నం సీఐ గొలగాని అప్పారావు ఆధ్వర్యంలో బందోబస్తు చేపట్టారు. కాగా.. ఉత్సవం పురస్కరించుకుని పూలతోటలోని శ్రీకృష్ణ కొలను వద్ద మూడుసార్లు వెలిగించిన జువ్వలు.. తిరిగి రావడంతో ఈ ఏడాది వరి, అపరాలు, మెట్ట పంటలు బాగా పండుతాయని భక్తులు విశ్వసించారు.



పూలతోటలో బాణసంచా వెలుగులు తిలకిస్తున్న భక్తులు



కొండ దిగువకు స్వామిని తీసుకొస్తున్న అర్చకులు, అధికారులు

ముగిసిన సంబరాలు

పోటెత్తిన నగర ప్రజలు

విశాఖ విద్య: ఆంధ్రా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో నాలుగు రోజుల పాటు జరిగిన జీవీఎల్ మహా సంక్రాంతి సంబరాలు బుధవారంతో ముగిశాయి. పట్టణంలో పల్లె వాతావరణాన్ని తలపించేలా మైదానంలో చేసిన ఏర్పాట్లు ఎంతగానో ఆకట్టుకున్నాయి. చివరి రోజు నగరవాసులు భారీగా తరలివచ్చి హరిదాసులు, బసవన్నలు, పల్లె నివాసాల వద్ద ఫొటోలు దిగారు. నాలుగు రోజుల పాటు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న కళాకారులకు జీవీఎల్ ఘనంగా సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు. ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన కోలాటం పోటీల్లో మధురవాడ శ్రీ లక్ష్మీనరసింహ కోలాట బృందం ప్రథమ బహుమతి గెలుచుకుంది. బృందం గురువు సిరిపురపు సంతోషికి రాజ్యసభ మాజీ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు, ఐడీబీఐ ఏజీఎం నరేష్ బహుమతి అందజేశారు. సంబరాలు ముగింపు సందర్భంగా ప్రజల సంక్షేమం కోసం ఈశ్వరాభిషేకం జరిపించారు. అనంతరం అర్చకులు వేద మంత్రాల నడుమ పూర్ణాహుతి హోమం నిర్వహించారు. జీవీఎల్, మైథిలి దంపతులు ఈ పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. సాయంత్రం ప్రముఖ సినీ నేపథ్య గాయకుడు కారుణ్య బృందం తమ గాన మాధుర్యంతో ఆహూతులను ఉర్రూతలూగించింది.



డూడూ బసవన్నలతో యువతుల సెల్ఫీ

గృహిణి అనుమానాస్పద మృతి

మద్రిపాలెం: అనుమానాస్పద స్థితిలో ఓ గృహిణి మృతిచెందిన ఘటన కంచరపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు. 47వ వార్డు మధుసూదన్‌నగర్‌లో ఉంటున్న ప్రసన్నలక్ష్మి(26) భరద్వాజ్‌ని 2021లో ప్రేమ వివాహం చేసుకుంది. వీరికి రెండున్నరేళ్ల కుమారుడు ఉన్నాడు. భర్త హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. ఏడాది నుంచి భార్యాభర్తలు వేర్వేరుగా ఉంటున్నారు. మృతురాలు నగరంలోని ఓ రియల్ ఎస్టేట్ కంపెనీలో పని చేస్తోంది. సంక్రాంతి సందర్భంగా శివాజీపాలెంలో ఉంటున్న ఆమె తల్లిదండ్రుల దగ్గరకు కుమారుడితో కలిసి వెళ్లింది. ముభావంగా ఉంటూ ఎవరితోనూ మాట్లాడకపోవడాన్ని తల్లిదండ్రులు గమనించారు. మంగళవారం తన కుమారుడిని ఆమె తల్లిదండ్రుల వద్ద వదిలి ఆమె మాత్రమే మధుసూదన్‌నగర్‌లోని నివాసానికి వెళ్లింది. ఇంటికి వచ్చి దీపాలు వెలిగించి, పూజ చేసుకుంది. కొంతసేపటికి పూజగది నుంచి పొగ రావడంతో స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు, ఫైర్ సిబ్బంది ఘటనాస్థలిని పరిశీలించారు. దీపాలు వెలిగించిన చోటే ఆమె కాలిపోయి, విగతజీవిగా పడిఉందని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. సీఐ చంద్రశేఖర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.



నౌక ప్రారంభోత్సవంలో పాల్గొన్న రక్షణ రంగ, నేవీ, ఎల్ అండ్ టీ అధికారులు

'ఉత్కర్ష్' ప్రారంభం

సాక్షి, విశాఖపట్నం: భారత నౌకాదళం కోసం 'ఉత్కర్ష్'అనే బహుళ ప్రయోజన నౌకను ఎల్‌అండ్‌టీ షిప్‌యార్డ్ నిర్మించింది. ఈ నౌకను ఈ నెల 13న చెన్నైలోని కట్టుపల్లిలో రక్షణ కార్యదర్శి రాజేష్ కుమార్ సింగ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బి.శివకుమార్, జయంత్ దామోదర్, అరుణ్ రామచందాని, భారత నౌకాదళం, ఎల్‌అండ్ టీ సంస్థలకు చెందిన పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు



'ఉత్కర్ష్' నౌక

ఘనంగా ఐఎండీ వార్షికోత్సవం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వాతావరణ కేంద్ర అధికారి

మహారాణిపేట: భారత వాతావరణ శాఖ(ఐఎండీ) వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఇందులో భాగంగా విశాఖలో తుఫాను హెచ్చరికల కేంద్రం వద్ద బుధవారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. రాడార్ పనిచేసే విధానం, పైలెట్ బెలూన్, ఉష్ణమానిని, పవన దిశ, ధృతి తెలియజేసే పరికరాలు, వాతావరణ విశ్లేషణా నమూనాలను ప్రదర్శించగా.. విద్యార్థులు తిలకించారు. వాతావరణ శాస్త్రం–భౌతిక సముద్ర శాస్త్ర విభాగం, జియోఫిజిక్స్ అంశాలపై చర్చా కార్యక్రమం జరిగింది. అనంతరం వాతావరణ కేంద్రం ఆవరణలో మొక్కలు నాటారు. చిత్రలేఖనం, వ్యాస రచన పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

నగరం.. పల్లెటూర్!

విశాఖ మహానగరం.. వలసవాసుల స్వర్గధామం. కష్టపడి పనిచేయాలనుకునే ప్రతి ఒక్కరికీ ఏదో ఒక ఉపాధినిచ్చే నగరం. అందుకే ఉత్తరాంధ్ర జిల్లాలతోపాటు, ఉభయగోదావరి జిల్లాలకు చెందిన వారు ఎక్కువగా బతుకుదెరువుకు విశాఖ వచ్చి, నివాసమేర్పరచుకుంటున్నారు. ఇలాంటి వారంతా సంక్రాంతి పండగ నేపథ్యంలో సొంతూళ్ల బాట పట్టారు. దీంతో గత రెండు రోజులుగా నగరం బోసిపోయింది. మరో రెండు మూడు రోజుల వరకు ఇదే పరిస్థితి కొనసాగనుంది.



జైలు రోడ్డులో పరిస్థితి ఇది..



వెలవెలబోయిన ఆశీలమెట్ట రోడ్డు

- బోసి పోయిన విశాఖ రోడ్లు
- మరో రెండు మూడు రోజులు ఇదే పరిస్థితి
- కిటకిటలాడిన బస్టాండ్, రైల్వే స్టేషన్
- ప్రైవేట్ బస్సుల్లో చార్జీల బాదుడు

మహారాణిపేట/సీతమ్మధార/డాబాగార్డెన్స్: నగరం పల్లెబాట పట్టింది. సంక్రాంతి పండగ చేసుకునేందుకు ప్రజలు తమ సొంతూళ్లకు తరలిపోయారు. దీంతో నగరంలోని అన్ని ప్రధాన కూడళ్లు నిర్మానుష్యంగా మారాయి. నిత్యం రద్దీతో కిటకిటలాడే కూడళ్లు కూడా అరకొర వాహనాలతో వెలవెలబోయాయి. ఆర్టీసీ కాంప్లెక్స్, ఆశీలమెట్ట, జగదాంబ, జాతీయ రహదారి, రామాటాకీసు, ద్వారకానగర్, ఎల్‌ఐసీ బిల్డింగ్ రోడ్డు, డాబాగార్డెన్స్, పూర్ణామార్కెట్ ఇలా ప్రధాన రోడ్లన్నీ ఖాళీగా దర్శనమిచ్చాయి.

పల్లె బాటలో నగరవాసి

తెలుగు వారి పెద్ద పండగ సంక్రాంతిని ప్రతి ఒక్కరూ తమ సొంతూళ్లలో చేసుకోవాలనుకుంటారు. సిటీ ఆఫ్ డెస్టినీగా పేరొందిన వైజాగ్‌లో దాదాపు 60 శాతం బతుకు తెరువు కోసం వలస వచ్చినవారే. ఉద్యోగ, వ్యాపార, స్వయం ఉపాధిలో ఇక్కడ నివాసం ఏర్పరచుకున్నవారే..! సంక్రాంతి సెలవులు వస్తే చాలు.. నగరానికి వచ్చేవారి కంటే.. నగరం నుంచి బయటి ఊళ్లకు వెళ్లేవారే ఎక్కువగా ఉంటారు. నగరంలోని చాలా మంది తమ పిల్లాపాపలతో సొంతూరి బాట పట్టారు. దీంతో బస్టాండ్లు, రైల్వే స్టేషన్ కిక్కిరిసిపోయాయి.

'ప్రత్యేక'సర్వీసులు ఫుల్

సంక్రాంతి సందర్భంగా ఆర్టీసీ, రైల్వే అధికారులు రద్దీ దృష్ట్యా ప్రత్యేక సర్వీసులు నడుపుతున్నారు. సెలవులకు నగరం నుంచి దూర ప్రాంతాలకు వెళ్లే రెగ్యులర్ బస్సులకు ఎక్కువ డిమాండ్ ఉంది. గత ఏడాది పండగ రద్దీని దృష్టిలో పెట్టుకుని విశాఖ రీజియన్ నుంచి రెగ్యులర్‌గా తిరిగే బస్సులతోపాటు, అదనంగా 260కి పైగా బస్సు సర్వీసుల్ని పెంచారు. విజయవాడ, హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, అమలాపురం, నర్సాపురం, భీమవరం మొదలగు దూరప్రాంత సర్వీసులతో పాటు విజయనగరం, రాజాం, పాలకొండ, పార్వతీపురం, శ్రీకాకుళం, సోంపేట, ఇచ్ఛాపురం, కాకినాడ, రాజమండ్రి ప్రాంతాలకు కూడా ప్రత్యేక బస్సులు నడుపుతోంది. ఈస్ట్ కోస్ట్ రైల్వే కూడా ప్రధాన ప్రాంతాలకు 10కి పైగా ప్రత్యేక రైళ్లను నడుపుతోంది. రైళ్లలోని జనరల్ బోగీల్లో అడుగు కూడా వెయ్యలేని పరిస్థితి. దీంతో ఫైన్లు కట్టి మరీ రిజర్వేషన్ బోగీల్లో ప్రయాణిస్తున్నారు.

భారీగా ప్రైవేట్ బాదుడు

పండగ రద్దీని ప్రైవేట్ బస్సు యాజమాన్యాలు సొమ్ము చేసుకుంటున్నాయి. రెట్టింపు ఛార్జీలు వసూలు చేస్తున్నారు. సాధారణ రోజుల్లో హైదరాబాద్‌కు రూ.800 నుంచి రూ.వెయ్యి ఉండే టికెట్ ధరను ఏకంగా రూ.1,800 నుంచి రూ.3 వేలు వరకు వసూలు చేస్తున్నారు. విజయవాడకు రూ.1800, రూ.2,550, రూ.2,670 వరకూ చార్జీల బాదుడు ఉంది.

ప్రభుత్వ కార్యాలయాలు ఖాళీ

సంక్రాంతి సెలవులతో ప్రభుత్వ కార్యాలయాలు బోసిపోయాయి. శనివారం నుంచి బుధవారం వరకు అన్నీ సెలవులే. గురువారం కార్యాలయం పనిచేసే రోజైనా ఉద్యోగులు వచ్చే అవకాశం చాలా తక్కువే. వరుస సెలవులతో కలెక్టర్ కార్యాలయంతోపాటు అనేక ప్రభుత్వ కార్యాలయాలు వెలవెలబోతున్నాయి. కార్యాలయాలు మూసి ఉండడంతో జనసందడి కరవైంది.

అల్పాహారానికీ తిప్పలే!

చిరువ్యాపారులు సైతం సొంత ఊళ్లకు వెళ్లిపోవడంతో టీకొట్లు, టిఫిన్ పార్లర్లు, సూపర్ మార్కెట్లు, ఇతర దుకాణాలు మూతపడ్డాయి. షాపింగ్ కాంప్లెక్సులు కూడా మూసి వున్నాయి. ఆశీలమెట్ట సంపత్ వినాయక దేవస్థానం నుంచి రైల్వేస్టేషన్‌కు వెళ్లే ఫ్లై ఓవర్ బ్రిడ్జి కర్ఫ్యూ వాతావరణాన్ని తలిపించింది. ఈ మార్గంలో మచ్చుకైనా వాహనాలు కానరాకపోవడం గమనార్హం.

భర్త వేధింపులు తాళలేక ఆత్మహత్య

- పదేళ్లుగా పుట్టింటికి పంపకపోవడంతో మనస్తాపం
- చింతగట్లలో తల్లిదండ్రులు, బంధువుల ఆందోళన



మృతి చెందిన పార్వతి



ఆందోళన చేస్తున్న మృతురాలి బంధువులు

పెందుర్తి: భర్త వేధింపులు తాళలేక ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పెందుర్తి మండలం చింతగట్లలో చోటుచేసుకుంది. భర్త తరచూ భౌతికదాడికి పాల్పడడంతో తీవ్ర మనస్తాపానికి గురై తనువు చాలించింది. తమ కుమార్తె మృతికి కారణమైన ఆమె భర్తను కఠినంగా శిక్షించాలని మృతురాలి తల్లిదండ్రులు, బంధువులు గ్రామంలో ఆందోళనకు దిగారు. పోలీసులు కలుగజేసుకుని పరిస్థితిని చక్కదిద్దారు. వివరాలివీ..

చింతగట్ల గ్రామానికి చెందిన గనిశెట్టి కనకరాజుకు నర్సీపట్నం మద్రివలసకు చెందిన పార్వతితో 14 ఏళ్ల కిందట వివాహం జరిగింది. వీరికి ముగ్గురు పిల్లలు. భార్య పార్వతిని కనకరాజు నిత్యం వేధించేవాడు. ఈ క్రమంలో దాదాపు పదేళ్లుగా ఆమెను పుట్టింటికి కూడా వెళ్లనివ్వలేదు. నిత్యం ఏదో కారణంతో కొట్టేవాడు. ఈ నెల 11న కూడా పార్వతిని తీవ్రంగా కొట్టడంతో ఆమె మనస్తాపానికి గురై కార్ ఏసీ కూలెంట్ వాటర్ తాగింది. దీంతో కుటుంబ సభ్యులు ఆస్పత్రిలో చేర్పించగా, చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందింది. బుధవారం ఉదయం పోస్టుమార్టం నిర్వహించిన తరువాత ఆమె మృతదేహాన్ని గ్రామానికి తీసుకువచ్చారు. తమ కుమార్తె మృతికి కారణమైన కనకరాజును తీవ్రంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ మృతురాలి తల్లిదండ్రులు, బంధువులు ఆందోళన చేశారు. వెంటనే స్పందించిన పోలీసులు గ్రామానికి చేరుకుని పార్వతి కుటుంబ సభ్యులకు నచ్చజెప్పి, అంత్యక్రియలు నిర్వహించారు. కనకరాజు పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం. సీఐ కె.వి.సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు జరుగుతోంది.

లారీ ఢీకొని మహిళ దుర్మరణం

మధురవాడ: సంక్రాంతి పండగ కోసం పద్మనాభం మండలం పాండ్రంగికి వెళ్తున్న కుటుంబంలో రోడ్డు ప్రమాదం అంతులేని విషాదాన్ని నింపింది. ఇంటి ఇల్లాలిని మృత్యువు రూపంలో వచ్చిన గూడ్స్ లారీ పొట్టనపెట్టుకుంది. ఈ ఘటనలో వెంకోజీపాలెం లోని పెటల్‌షెడ్‌కి చెందిన మైలపల్లి చందు(28) మృతి చెందింది. పీఎంపాలెం పోలీసులు తెలిపిన వివరాలు. పద్మనాభం మండలం పాండ్రంగికి చెందిన మైలపల్లి శ్రీను డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. బతుకు తెరువు నిమిత్తం విశాఖకు వచ్చి వెంకోజీపాలెంలో నివాసం ఉంటున్నాడు. మొదటి భార్య కనకమహాలక్ష్మి అనారోగ్యంతో మృతి చెందడంతో చందును రెండో వివాహం చేసుకున్నాడు. సంక్రాంతి పండగ కోసం చిన్న కుమారుడు తేజ(11)తో మంగళవారం సాయంత్రం తన ద్విచక్ర వాహనంపై పాండ్రంగి బయలు దేరాడు. కార్‌షెడ్ వద్ద బస్టాప్‌కు వెళ్లే సమయంలో గూడ్స్ లారీ అతివేగంగా వచ్చి ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. దీంతో చందు రోడ్డుపై పడిపోయింది. ఆమె పైనుంచి లారీ దూసుకెళ్లడంతో, కాళ్లు నలిగిపోయి, తీవ్ర రక్తస్రావమై అక్కడికక్కడే మృతి చెందింది. ప్రమాదానికి కారణమైన గూడ్స్ లారీ డ్రైవర్ అమలాపురంలోని సీతాపతిరావుపేటకు చెందిన డి.రామకృష్ణగా గుర్తించారు. మృతురాలి భర్త శ్రీను ఫిర్యాదు మేరకు పీఎంపాలెం పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.



ఘటనా స్థలిలో చందు మృతదేహం

బుడగ జంగాల సందడి



పూర్ణామార్కెట్ వెలంపేట వద్ద ఓ వ్యక్తిని పొగుడుతున్న బుడగ జంగం

డాబాగార్డెన్స్: నగరంలో బుడగ జంగాళ్లు సందడి చేశారు. తూర్పుగోదావరి జిల్లా కోటిపల్లి రేవు నుంచి సుమారు 230 మంది బుడగ జంగాళ్లు భోగి ముందు రోజే నగరానికి చేరుకున్నారు. వీరు నగరంలోని వెలంపేట, ప్రసాద్‌గార్డెన్స్, కల్లుపాకలు, కొబ్బరితోట, రామకృష్ణాజంక్షన్ ఏరియా, అల్లిపురం, మహారాణిపేట, సాలిపేట, కోటవీధి, వన్‌టౌన్ ఏరియా, పంజా జంక్షన్, వీరు నగరంలోని వెలంపేట, ప్రసాద్‌గార్డెన్స్, కల్లుపాకలు, కొబ్బరితోట, రామకృష్ణాజంక్షన్, అల్లిపురం, మహారాణిపేట, సాలిపేట, కోటవీధి, వన్‌టౌన్, పంజా జంక్షన్, పెయిన్‌దొరపేట, సూర్యాబాగ్, డాబాగార్డెన్స్, లక్ష్మీనగర్, పద్మానగర్, చిలకపేట వంటి మురికివాడలతో పాటు అఫీషియల్ కాలనీ, ఎంవీపీ, విశాలాక్షినగర్, సీబీఎం కాంపౌండ్ వంటి ప్రాంతాల్లో మూడు రోజుల పాటు తిరుగుతూ, అపార్టుమెంట్లు, కాలనీల్లోని ఇళ్లకు వెళ్లి పితృదేవతలకు పూజలు నిర్వహించారు. నేరుగా పితృదేవతలే ఇంటికి దిగివచ్చినట్లు పొగుడుతూ.. ఎంతో కొంత నగదు తీసుకుని దీవించారు. ప్రతిరోజూ ఒకే చోటకు చేరుకుని.. వివిధప్రాంతాలకు వెళ్లడం, పొద్దుపోగానే మళ్లీ అదే స్థలంలో కలుసుకునే వారు. కనుమ ముగిసిన తర్వాత వీరంతా తిరిగి కోటిపల్లి రేవుకు బయలుదేరారు. అలాగే నగర శివార్లతో పాటు కొత్తవలస, చింతల అగ్రహారం, ఆనందపురం, కొమ్మాది, దేవరాపల్లి తదితర ప్రాంతాల నుంచి వచ్చిన గంగిరెద్దుల వారు కూడా పండగ రోజుల్లో నగరంలో సండి చేశారు.

విశాఖ బులియన్

24 క్యారెట్స్(10 గ్రా.)	రూ.80,070
22 క్యారెట్స్(10 గ్రా.)	రూ.73,400
వెండి(కిలో):	రూ.1,01,000

చికెన్ ధరలు



చికెన్ (కిలో) (వెన్‌కాబ్)

బ్రాయిలర్ (లైవ్)	: రూ.140
స్కిన్	: రూ.250
స్కిన్‌లెస్	: రూ.260

కోడిగుడ్ల ధరలు

	రూ.లలో (వందకు)
విశాఖ	520.00
విజయనగరం	524.00
శ్రీకాకుళం	524.00

ఘనంగా బౌద్ధ మేళా

అనకాపల్లి: ఉమ్మడి విశాఖ జిల్లాల బౌద్ధ సంఘాల ఆధ్వర్యంలో కొండ దిగువన బౌద్ధ మేళా నిర్వహించారు. అనంతరం బౌద్ధ పతాకంతో కొండపై గల ప్రధాన స్థూపం వరకు శాంతి ఊరేగింపు చేపట్టారు. బుద్ధుడి గుహలో ప్రధాన స్థూపం వద్ద పుష్పాంజలి, బుద్ధ వందనం, దమ్మదీక్షని నాగపూర్‌కు చెందిన బౌద్ధవులు వెనరబుల్ డాక్టర్ జ్ఞానదీప్ మహాథేరో, బోధ్గరత్న మహాథేరోలు ఘనంగా నిర్వహించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ప్రశ్నించే తత్వం ఉన్న బౌద్ధ మతాన్ని విదేశాల్లో ఎక్కువ ఆదరిస్తున్నారన్నారు. బౌద్ధ సంఘాల అధ్యక్షుడు డాక్టర్ మాటూరి శ్రీనివాస్ మాట్లాడుతూ బొజ్జన్నకొండను, విశాఖలో తొట్లకొండను కాపాడుకోవలసిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. అనంతరం భూమి మాసపత్రిక, క్యాలెండర్‌ను శ్రీనివాస్ ఆవిష్కరించారు. అంబేడ్కర్ మెమోరియల్ సొసైటీ విశాఖ అధ్యక్షుడు బొడ్డు కల్యాణరావు, వివిధ సంఘాల నాయకులు బోర వేణుగోపాల్ గౌతమ్, గొంది నవీన్, కర్రి సత్యనారాయణ, ధమ్మాచారి రావూరి విజయకుమార్, బల్లా నాగభూషణం, బోర లోకేశ్వరరావు బోధి, జెవి.ఝాన్సీలక్ష్మి, పల్లా బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.